వాయుగండం పట్ల అప్రమత్తంగా ఉండండి

పాడేరు సబ్ కలెక్టర్

విశాలాంధ్ర - చింతపల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావానికి తోడైన వాయు గండం పట్ల మన్యవాసులు అప్రమత్తంగా ఉండాలని పాడేరు సబ్ కలెక్టర్ అన్నారు. సోమవారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో మన్య ప్రాంతంలో అధిక వర్షపాతం నమోదు కావడంతోపాటు మన్య ప్రాంతంలో అనేక రహదారులు కోతకు గురై కల్వర్టులు, అప్రోచ్ రహదారులు కొట్టుకుపోయిన సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహన చోదకులు ఆచితూచి ప్రయాణం చేయాలని సూచించారు. కాలువలు దాటే క్రమంలో మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు.

చట్రాపల్లి గ్రామస్తులకు పునరావాసం ఏర్పాట్లు : ఐటీడీఏ పీఓ అభిషేక్

విశాలాంధ్ర - జీకే వీధి : మండలంలోని చట్రాపల్లి గ్రామస్తులకు పురావాస ఏర్పాట్లు చేస్తున్నామని ఐటిడి ఏ పి. ఓ వి. అభిషేక్ స్పష్టం చేసారు. సోమవారం జి. కె. వీధి మండలంలో పర్యటించి గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బ తిన్న రోడ్లు కల్వర్టులను పరిశీలించారు. చట్రాపల్లి గ్రామానికి వెళ్లాలని ప్రయత్నించిన పి. ఓకు రహదారి మార్గం లేదని అధికారులు చెప్పడంతో గ్రామస్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. చిట్రాపల్లి గ్రామంలో 30 కుటుంబాలు 120 మంది జనాభా ఉన్నారని రెవెన్యూ అధికారులు పి. ఓ దృష్టికి తీసుకుని వచ్చారు. చట్రాపల్లి గ్రామస్తులను సప్పర్ల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు తరలించి పునరావాసం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అందరకి భోజన వసతి సదుపాయాలు కల్పించాలని చెప్పారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలను రెవెన్యూ అధికారులు ఆధీనంలోకి తీసుకుని బాధితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. వైద్య సేవలు అవసరమైన వారికి సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించాలని సూచించారు. సంపంగి గొంది, లంకపాకలు గ్రామాల వరకు పర్యటించి దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను పరిశీలించారు. జాతీయ రహదారి అధికారుల సహాయం తీసుకుని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. లంకపాకలు గ్రామం వద్ద కల్వర్టు దగ్గర బారి కేడింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. రహదారుల పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి చేయాలని రహదారులు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నేషనల్ హైవే అధికారుతో మాట్లాడే రహదారుల మరమ్మతులకు సహకారం అందించాలని అన్నారు. రింతాడ గ్రామం వద్ద వర్షాలకు దెబ్బతిన్న రహదారిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రహదారులు భవనాల శాఖ బాల సుందర బాబు, గిరిజన సంక్షేమ శాఖ డి.ఇ చాణక్యరావు, రెవెన్యూ డిప్యూటీ తాసిల్దార్ కుమార స్వామి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎస్సై అప్పలసూరి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం జరిగిందని అధైర్య పడవద్దు సర్పంచ్ పుష్పలత

విశాలాంధ్ర - చింతపల్లి : అల్పపీడన ప్రభావం కారణంగా పంట నష్టం జరిగిందని రైతులు అధైర్య పడవద్దని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. పంచాయతీ పరిధిలోని మల్లవరం, గడపరాయి, కందుల గాది, చిలకలమామిడి తదితర గ్రామాలలో అల్పపీడన ప్రభావం వలన ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను సచివాలయం - 2 అగ్రికల్చర్ అసిస్టెంట్ చంద్రకళ, వీఆర్వో చిరంజీవి లతో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత మునిగిన పంట పొలాల విషయం అధికారుల దృష్టికి తీసుకువెళతాను అన్నారు. నీట మునిగిన పంట పొలాలకు సంబంధించి రైతులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. ఉధృతంగా కురుస్తున్న వర్షాలకు కొండ చరియలు విరిగిపడి వంతెనలు కూలే అవకాశం ఉన్నందున కొండ దిగువ ప్రాంతంలో ఉన్నవాళ్లు వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, వరద ఉధృతి తగ్గేంత వరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ముత్తా శ్రీను, వార్డు సభ్యుడు లింగబాబు, సుబ్బారావు, కేశవరావు, మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడన ప్రభావానికి మన్యం వాసులు ఉక్కిరిబిక్కిరి

తెదేపా అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగభూషణం

విశాలాంధ్ర - చింతపల్లి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మన్య ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దాటికి మన్య వాసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని తెదేపా అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నో అల్పపీడనాలు వచ్చినప్పటికీ చెక్కుచెదరని మన్య ప్రాంతం ఈసారి వచ్చిన అల్పపీడన ప్రభావంతో గడచిన రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అతలాకుతలం అయిందన్నారు. వర్షం కారణంగా మన్య ప్రాంతంలోని వాగులు, వంకలు, చెరువులు జలాశయాలు నిండు కుండలను తలపించడమే గాక, పంటపొలాలను సైతం ముంచెత్తాయన్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో గృహాలు కూలిపోవడం తో పాటు రహదారులన్నీ జలమయమై కల్వర్టులు, అప్రోచ్ రహదారులు కొట్టుకుపోయి మైదాన ప్రాంతానికి, మన్య ప్రాంతానికి సంబంధాలు తెగిపోయాయన్నారు. అదే క్రమంలో మన్య ప్రాంతంలోనూ అనేక గ్రామాలకు రాకపోకలు స్తంభించి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికే మారుమూల ప్రాంత గిరి గ్రామాలలో ప్రజల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందన్నారు. ఈ అల్పపీడన ప్రభావదాటికి ఎక్కడా ఎటువంటి విపత్కర పరిస్థితులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తం చేసిన తీరు ప్రశంసనీయమన్నారు. తహసిల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో ఆశాజ్యోతి, సిఐ రమేష్, ఎస్ఐ అరుణ్ కిరణ్‌ల పర్యవేక్షణ అద్భుతం అన్నారు. అదే క్రమంలో ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు సమిష్టిగా ప్రజలకు కలిగే ఇబ్బందుల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ అల్పపీడనం మన్య ప్రాంతానికి పీడకల వంటిదని ఆయన అభివర్ణించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన జోస్యం చెప్పారు.

భారీ వర్షాలతో ఆహ్లాద పరుస్తున్న జలపాతాలు

విశాలాంధ్ర - అనంతగిరి : అనంతగిరి ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలో ప్రముఖ జలపాతాలు అన్ని కళకళలాడుతూ ఉప్పొంగుతున్నాయి వీటిని చూసి పర్యాటకులు ఆహ్లాదం చెందుతున్నారు మండలంలో కటికి తాడిగుడ ఎం ఆర్ పురం సరియా జలపాతాలు ఉప్పొంగే ప్రవహిస్తున్నడంతో వచ్చే పర్యాటకులు ఈ జలపాతాలను చూసి మంత్ర ముద్దుల అవుతున్నారు మండలంలో ఈ జలపాతాలు వర్షాకాలం అయిన ఎండాకాలమైన పొంగి ప్రవ హించడం ఈ వర్షాలతో మరింత పొంగి ప్రవహించడం జల పాతాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి ఇటువంటి జలపాతాలను పర్యాటక మరింత అభివృద్ధి చేస్తే ఏడాది పొడవునా పర్యాటకులకు ఆహ్లాదపరంగా ఉంటుందని పర్యాటకులు కోరుతున్నారు.

భారీ వర్షాలకు మళ్లీ గండి పడిన గోమంగి బ్రిడ్జి

మట్టి పోసి చేతులు దులుపుకున్న ఆర్ అండ్ బి అధికారులు

విశాలాంధ్ర - పెదబయలు : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోమంగి బ్రిడ్జి మళ్లీ గండి పడిందని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలుపారు వారు మాట్లాడుతూ గత భారీ వర్షాలకు బ్రిడ్జి భారీగా రంధ్రం పడటం అన్ని పత్రికల్లో కథనాలు రావడంతో ఆర్ అండ్ బి అధికారులు తాత్కాలికంగా మట్టి పోసి వదిలేయడంతో, మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలకు బ్రిడ్జి మళ్ళీ రంధ్రం పడిందని. భారీ వర్షాలు పడితే బ్రిడ్జి మీద గడ్డ పొంగి ప్రవహి స్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి స్వస్థత పరిష్కార మార్గం చూపాలని, డిమాండ్ చేశారు రోడ్ల మీద గడ్డలు పొంగి ప్రవహిస్తుండడంతో అత్యవసర పరిస్థితి రోగులకు ఆసుపత్రిలో తీసుకెళ్లాలి అన్న అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం అధికారులు స్పందించి బ్రిడ్జి ఎత్తుగా నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లాలీ బాబు, మహేష్, లక్ష్మణ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చాపరాయిలో అన్న సమారాధన

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : పర్యటక కేంద్రం చాపరాయి జలవిహారిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కమిటీ సభ్యులు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడి చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, కార్యదర్శి సులోచన ఆధ్వర్యాన ఉత్సవాల్లో భాగంగా అన్న సమారధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాలతో జలవిహారి ఉధృతితో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మూత బడింది. వినాయక ఉత్సవాన్ని పురస్కరించుకుని చిరు వ్యాపారుల సంఘ ప్రతినిధులు అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించి, గిరిజన సంప్రదాయ నృత్యం థింసాతో నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు.

పారిశుద్ధ్య పనులు తక్షణమే చేపట్టాలి..

పారిశుద్ధ్యం లోపిస్తున్న వడ్డెగూడెం పంచాయతీ

విశాలాంధ్ర -వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని వడ్డిగూడెం గ్రామ పంచాయతీలో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుందని, విఆర్ పురం గ్రామంలో ఎర్ర బ్రదర్స్ పక్క సందులో వీధిలైట్లు లేవని నడవడానికి సరి అయిన వీధి రహదారి లేదంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించు కున్న నాధుడే లేడనీ. అసలే వర్షాకాలం జ్వరాలు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ ప్రబల్లే అవకాశం ఉంటుంది ఇలాంటి సమయంలో పంచాయతీ అధికారులు పట్టించుకున్న దాఖలు లేవని పంచాయితీ సెక్రెటరీకి, సర్పంచ్‌కి చాలా సార్లు విన్నవించుకున్నా పట్టించు పోవడం లేదని వాపోతున్నారు. పంచాయితీ అభివృద్ధికి వచ్చిన నిధులు ఏమయ్యాయి అని ఇంటి పనులు, మంచినీటి బిల్లులు, సంత పాట డబ్బులు ఏమవుతున్నాయని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీస రహదారి లేక బురదలో స్కూల్ కి వెళ్లే పిల్లలు, పెద్దలు నడుచుకుంటూ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, కనీసం పంచాయతీ సెక్రెటరీ ఈ బురద ఉన్నచోట బ్లీచింగ్ జల్లించిన దాఖలు లేవని ,రోడ్డు ఎలాగో వేయరు కనీసం రోగాలు బారిన పడకుండా చూసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు. రాత్రి అయితే చీకటిలో పిల్లలు పెద్దలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని. పాములు రాత్రివేళ సంచరిస్తున్నాయి అని వాటి వలన ప్రజలు భయపడుతున్నారన్నారు. కనీసం వీధిలైట్లు వెయ్యమని పంచాయతీ అధికారులు సెక్రెటరీ, సర్పంచ్‌కి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వీధిలైట్లు, బ్లీచింగ్, దోమలకు ఫాగింగ్, రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

ఎమ్మెల్యేకు రూ.25 వేల విరాళం అందజేసిన మాజీ జడ్పీటీసీ

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని కాసాపేట గ్రామానికి చెందిన మాజీ జడ్పిటిసి, టీడీపినేత తెంటు వెంకటప్పలనాయుడు తుఫాన్ బాధితుల సహాయార్థం 25 వేలరూపాయల నగదును ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు అందజేశారు. సోమవారం నాడు విజయవాడలో తుపాన్ బాధితుల ప్రాంతాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే విజయ్ చంద్రకు వెంకట అప్పల నాయుడు మండలటిడిపినేతల సమక్షంలో అందజేశారు. నియోజకవర్గంలోని టిడిపి, బిజెపి, జనసేననాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున విరాళాలు అంద జేయాలని ఎమ్మెల్యే విజయ్ చంద్ర విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెంట సత్యం నాయుడు, రౌతువేణుగోపాల నాయుడు, అరవింద్, వి.గుంపస్వామి నాయుడు సింహాచలం నాయుడు, నాగభూషణం, భాస్కరరావు, తేలు చంద్రశేఖర్, తేలు తిరుపతి పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు ఏడాది : మంత్రి సంధ్యారాణి

విశాలాంధ్ర - సాలూరు : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన అందించడమే కాకుండా నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో అవినీతి మరక లేని నాయకుడుగా చంద్ర బాబు నిలిచారన్నారు. అటువంటి నాయకుడిని వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసిందన్నారు. నీతి, నిజాయితీ, పారదర్శకత అనేది చంద్రబాబు ప్రత్యేకత అని అందుకే చంద్రబాబు ను అరెస్ట్ చేసినప్పుడు పార్టీలకు అతీతంగా అన్నివర్గాలు వారు ఖండించారని మంత్రి సంధ్యారాణి అన్నారు.సోమవారం తన నివాస గృహంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు కు స్కిల్ డెవలప్మెంట్ స్కాం తో సంబంధం లేకపోయినా కేసు నమోదు చేసిన 22 నెలల తరువాత నిందుతుడిగా చేర్చి అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. అక్రమ అరెస్ట్ కు ఖండిస్తూ సుమారు 70 దేశాలలో తెలుగు ప్రజలు నిరసన వ్యక్తం చేశారన్నారు. చంద్రబాబు అరెస్ట్‌తో పాటు వైసీపీ అవినీతి అరాచక పాలనకు విసుగుచెందిన ఎపి ప్రజలు ఎన్నికలలో వైకాపా కు కేవలం 11 సీట్లతో బుద్ధి చెప్పారన్నారు.కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత చంద్రబాబు నాయకత్వంలో ప్రజా శ్రేయస్సు, సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తుందన్నారు. నవ్యాంధ్ర ప్రదేశ్ పునర్నిర్మాణమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వృద్ధాప్య ఫించన్ 4 వేలకు పెంపుదల,16347 పోస్టులతో మెగా డిఎస్సీ,నైపుణ్య గణన, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు,అన్నా క్యాంటీన్ల పునరుద్ధర మరియు ప్రకృతి విపత్తుల సమర్థ నిర్వహణ వంటి వాటిపై దృష్టి కేంద్రీక రించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు సాలూరు, మక్కువ, పాచిపెంట, సాలూరు పట్టణ పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, గుళ్ల వేణు, పిన్నింటి ప్రసాదబాబు, నిమ్మాది తిరుపతి రావు పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యార్థుల సమస్య పరిష్కారానికి చర్యలు

విశాలాంధ్ర - సీతంపేట : ఐటిడిఏ పరిధిలో గలభామిని ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, విద్యార్థులను అక్కడికి తరలించే ప్రక్రియను వేగవంతం చేస్తామని ఏకలవ్య విద్యార్థుల సమస్య పరిష్కారానికి ముందడుగు వేయడం జరుగుతుందని ఐటిడిఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం మల్లి గురుకుల పాఠశాలను పరిశీలించి, అక్కడ ఉన్న భామిని ఏకలవ్య పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటానని విద్యార్థులతో అన్నారు. తక్షణ పరిష్కారం కింద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ఇంకా ఇతర సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయ నిధికి సహకరించండి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : ఇటీవల కురిసిన అధిక వర్షాల వలన విజయ వాడ నగరంలో సంభ వించిన వరద ముప్పు కారణంగా ఇబ్బందులు పడుతున్న ఆ ప్రాంత ప్రజలకు అండగా నిలవాలని పార్వతీపురం నియోజకవర్గం ఎన్డీఏ ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర గారు పిలుపునిచ్చారు. మానవత దృక్పథంతో తోడుగా నిలవాలని విజయవాడ విపత్తు వరద బాధితులకు విరాళాలు అందించడంలో ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం నియోజక వర్గంలో విజయవాడ విపత్తు వరద బాధితులకు, సహాయం చేయడానికి, నాయకులు, అధికారులు వ్యాపారులు కార్యకర్తలు, అభిమానులు విరాళం ప్రకటించే వారు ముందుకు రావాలన్నారు. విరాళాలు అందించగలిగిన వారు చెక్కు రూపంలో నగదు రూపంలో ఇవ్వాల్సిన వారు టిడిపి పార్టీ కార్యాలయనికి అందించ గలరనికోరారు.

జంఝావతి ప్రాజెక్ట్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - కొమరాడ : జిల్లాలో భారీ వర్షాలు పడే హెచ్చరికల నేపథ్యంలో జంఝావతి ప్రాజెక్ట్ వద్ద నీటి ప్రవాహం ఉధృతి, ప్రస్తుత నీటి స్థాయిలను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. కొమరాడ మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటనలో భాగంగా జంఝావతి ప్రాజెక్ట్, లాబేసు - పూర్ణ పాడు వంతెన నిర్మాణం, కల్లి కోట వద్ద ఇసుక రీచ్ ను సోమవారం పరిశీలించారు. జంఝావతి ప్రాజెక్టు వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒడిషాతో అంతర్ రాష్ట్ర అంశాలు కారణంగా ప్రాజెక్ట్ పూర్తి కావడానికి జాప్యం జరుగుతోందని ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. రివర్ గ్యాప్ లో రబ్బర్ డ్యామ్ అమర్చినట్లు తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని రబ్బర్ డాం డ్యామేజ్ కాకుండా ముందుజాగ్రత్తగా మూసివేసినట్లు తెలిపారు. వాతావరణం సాధారణ పరిస్థితికి వచ్చిన వెంటనే రబ్బర్ డ్యామ్ పెంచి కాలువల ద్వారా సాగునీరు అందిస్తామని వెల్లడించారు. జంఝావతి నది సుమారు నాలుగు కిలోమీటర్ల మేరకు ప్రవహించి నాగావళి నది లోకి కలుస్తుందని ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. స్పిల్ వే పనులు పూర్తి, తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

లాబేసు - పూర్ణ పాడు వంతెన పరిశీలన

లాబేసు - పూర్ణ పాడు వంతెనను ప్రస్తుత పరిస్థితిని జిల్లా కలెక్టర్ ఎ .శ్యామ్ ప్రసాద్ పరిశీలించారు. ప్రస్తుతానికి జరిగిన వంతెన నిర్మాణం పనులు గురించి ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించి ఆరా తీశారు. వంతెన నిర్మాణం పనుల్లో భాగంగా మొత్తం 12 స్లాబ్ లతో నిర్మాణ పనులు పూర్తికావల్సి ఉండగా ఏడు స్లాబులు పూర్తి అయ్యాయని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ ఇరువైపులా గ్రామ ప్రజల రాకపోకలు సాగేలా వంతెన నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. వర్షా కాలంలో పనులు నిర్వహించేందుకు వీలులేనందున వంతెన నిర్మాణం పూర్తికి పక్కా అంచనాలతో చర్యలు చేపట్టాలని సూచించారు. వంతెన సిద్ధమైతే గ్రామ రహదారులు, అప్రోచ్ రోడ్డులను విశాలంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదే శించారు. గ్రామంలోని హై రిస్క్ గర్భిణీలు ఎవరైనా ఉన్నారా అనే విషయాలను ఆరా తీశారు. జ్వరాలు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత ను తప్పకుండా పాటించాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అక్కడ నుంచి మండలంలోని కల్లికోట ఇసుక రీచ్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కే. హేమలత, జంఝావతి ప్రాజెక్ట్ కార్యనిర్వాహక ఇంజనీర్ ఎస్.జగదీశ్వరరావు, డిఈ ఏ.దిల్లేశ్వర రావు, తాసిల్దార్ రమేష్‌కుమార్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి వి.శ్రీనివాస్, ఎం మల్లికార్జున రావు వ్యవసాయ అధికారి పిశంకర్రావు జేఈ అభిషేక్ వర్మ ఎస్ఐకే నీలకంఠం సర్పంచ్ దత్తి మురళి మండల సర్వే సోమనాయుడు గ్రామీణ మంచినీటి విభాగం జేఈనవీన్ తదితరులు అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు కర్మాగారాన్ని ప్రారంభించడానికి తగు చర్యలు తీసుకుంటా : ఎమ్మెల్యే విజయ్ చంద్ర

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేట ఎన్సిఎస్ చక్కెర కర్మా గారంలో కార్మికుల సమస్యలను పరి ష్కరించడంతో పాటు వారికి రావ లసిన పిఎఫ్, గ్రాట్యూటీ తదితర రాయితీలు సత్వరమేచెల్లించేలా కృషి చేస్తానని, దీనితోపాటు రానున్న మూడు నెలల్లో కర్మాగారంలో క్రసింగ్ కోసంకూడా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర తెలిపారు. సోమవారం నాడు లచ్చయ్యపేట ఎన్సిఎస్ చక్కెర కర్మాగారాన్ని ఆయన సందర్శించి కార్మికులతో మాట్లాడారు.కర్మాగారంలో కార్మికులకు రావలసిన పిఎఫ్, గ్రాట్యూటీ ఇతర బకాయిలుగూర్చి ఎన్సిఎల్ టీ ప్రతినిధి శివలింగముతో మాట్లాడి వాటిని త్వరితగతిన అందజేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. కర్మాగారంలో ఒకసారి బ్యాంకర్ల తోనూ కార్మికులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తెలియజేశారు. కర్మాగారానికి పూర్వవైభవం వచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్మాగార యూనియన్ నాయకులు చెలకాని వెంకట గోపాలకృష్ణ, కండాపు ప్రసాదరావు, శ్రీరామ్, స్వామి, అప్పారావు తదితరులతో పాటు రెవెన్యూ,పోలీస్ అధికారులు, కర్మాగార ఇంచార్జి నాగరామరావు టిడిపినాయకులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు, సాల హరగోపాల్, సబ్బాన శ్రీనివాసరావు, కంకణాలపల్లి అరవింద్ కుమార్, తెంటు వెంకటప్పలనాయుడు ఏగిరెడ్డిభాస్కరరావు, పైల నాగ భూషణరావు, రెడ్డి సింహాచలంనాయుడు, సోమిరెడ్డి రమేష్, వంజరాపు గుంప స్వామినాయుడు, వాకాడ పారినాయుడు, బలగ శ్రీనివాసరావు,తేలుచంద్రశేఖర్, పెంట సురేష్, తేలు తిరుపతి, బొన్నాడ సత్యనారాయణ, పరిసినాయుడు, యాళ్ల రామినాయుడు, కంద్యాన రవీంద్రనాయుడు, బలగ ధనంజయ నాయుడు, ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తుఫానుపై అప్రమత్త చర్యలు

తహశీల్దార్ రాములమ్మ

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలను అప్రమత్తం చేయడమే కాక సిబ్బందిని గ్రామాల్లో అందు బాటులో ఉంచి, సువర్ణముఖి నదితీర ప్రాంతం వైపు వెళ్ళవద్దని సూచిస్తున్నట్లు తహశీల్దార్ జె.రాములమ్మ తెలిపారు సోమవారం ఆమె తనకార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ ఇతర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుఫాన్ చర్యలను చేపట్టడం జరుగుతుందన్నారు. మండలంలోని కొత్తవలస నుండి పెదంకలాం వరకు ఉండే సువర్ణముఖి నది పరివాహక ప్రాంతంలో ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. తుఫానుపై , వర్షపాతంపై అధికారుల ఆదేశాలమేరకు ఎప్పటికప్పుడు రెవెన్యూ సిబ్బందిని, సచివాలయ సిబ్బందిని, పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా నదులవైపు, కాలువలవైపు వెళ్ళవద్దని సూచించారు. అవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని సూచించారు. మండలంలోని అన్ని శాఖల అధి కారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆమెతోపాటు డిప్యూటీ తహసిల్దార్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన

విశాలాంధ్ర - సీతంపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కూటమి ప్రభుత్వం ఎన్నికైన నాటినుండి అభివృద్ధి లక్ష్యంగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పడాల భూదేవి సోమవారం విలేకరులు తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ 4000 రూపాయలు, అమరావతి రాజధాని లక్ష్యంగా అభివృద్ధి పనులు, పోలవరం అభివృద్ధి పనులు మరియు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం తెలుగుదేశం, జనసేన, బిజెపి సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జయశంకర్, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయార్థం విరాళాల సేకరణ

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం : విజయవాడ వరద బాధితులకు సహాయార్థం గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే జగదీశ్వరి ఆధ్వర్యంలో విరాళాలు సేకరించడం జరిగింది. గుమ్మలక్ష్మీపురం గ్రామంలో గల పాత బస్టాండ్ నుండి ఎల్విన్ పేట జంక్షన్ వరకు వీధి వీధికి తిరిగి షాపులు వద్ద దాతలు నుండి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ ఇటీవల తుఫాను కారణంగా వరద బాధితులకు ప్రతి ఒక్కరూ విరాళాలు ఇచ్చి విజయవాడ వరద బాధితులకు తమ వంతుగా సహాయం చేసి వారిని ఆదుకోవాలని కోరారు. బాధితులు అసహాయ స్థితిలో ఉన్నందున వారిని ఆదుకోవడానికి విరాళాలు సేకరణ చేపట్టినట్లు వివరించారు. సామాన్యులు నుండి వ్యాపార, విద్యారంగం, వైద్యరంగం అందరూ సహకరించాలని ఎమ్మెల్యే జగదీశ్వరి కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంఘ నాయకులు లోవరాజు, భారతి, పోలూరు శ్రీనివాసరావు, జగన్నాథం, మన్మధరావు, చిన్న, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిశిఖర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయండి : కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : గిరి శిఖర గ్రామాలు, కొండవాలు ప్రాంతాలలో నివాసం ఉండే ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం జిల్లాపై ఎక్కువగా ఉందన్నారు. ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయని స్పష్టం చేసారు. సోమ వారం ఉదయం కలెక్టరేట్ నుండి అధికారులతో టెలీ కాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులు, వంతెనలు ఎక్కడ తెగిపోయాయో వెంటనే సమాచారం అందించాలని స్పష్టం చేసారు. ప్రజలు కాలి నడకన, వాహనాలపైన వాగులు గెడ్డలు దాటకుండా చైతన్యవంతం చేయాలని సూచించారు. తెగిపోయిన గెడ్డలు, వాగుల వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బందిని నియమించాలని అన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది నిరంతరం కాజ్ వేలు, కల్వర్టుల పరిస్థితులను పరిశీలించి నివేదించాలని చెప్పారు. మండలాల్లో వర్షపాతం నమోదు సక్రమంగా చేయాలని పేర్కొన్నారు. పాడేరు డివిజన్లో తొమ్మిది చోట్ల, రంపచోడవరం డివిజన్లో ఏడు చోట్ల రకాపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రమాదాలు తాగునీటి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పంటనష్టాలను నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న ఐదు ఘాట్ రోడ్లలో వాహనాల రవాణాను నిషేదం పొడిగించాలని అన్నారు. నిత్యావసర సరుకులు, అత్యవసర సేవల వహనాలను అనుమతించాలని అధికారులను ఆదేశించారు. రహదారులు పునరుద్ధరణ వనులను యుద్ధ ప్రాతి పదికన చేపట్టాలని రాహదారులు భవనాలు, పంచాయితీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రానున్న 24 గంటల్లో పునరుద్దరణ పనులు పూర్తి చేసి రవాణా సదుపాయాలు మొరుగు పరచాలన్నారు. జోలా పుట్టు డ్యాం ఏడు గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారని లోతట్టు గ్రామాల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలన్నారు. చింతూరు డివిజన్ శబరి నదికి 38 అడుగుల నీటి మట్టం పెరిగినందున ప్రభావిత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించాలన్నారు. రంపచోడవరం డివిజన్ లో అన్ని మండలాలలో నీటి ప్రవాహాలు అధికంగా ఉందని చెట్లు నేలకొరిగే అవకాశం ఉందని అవసరమైన చోట పునరావాసం కల్పించాలని పేర్కొన్నారు. పాడేరు డివిజన్ పాడు పడి భవనాలు, మట్టి నిర్మాణాలు, కల్వర్టులు పరిశీలించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం జి.కె. వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి కొండ చరియలు విరిగి పడి మృతి చెందిన కొర్రా 8(20) కుటుంబ సభ్యులకు జాతీయ, రాష్ట్ర విపత్తుల సంస్థ నిబంధనల మేరకు రూ.5 లక్షల ఎక్స్గ్రేషియాను జిల్లా కలెక్టర్ ప్రకటించారు. మరో ముగ్గురు వ్యక్తులు కొర్రా పండన్న (60), కొర్రా సుమిత్ర (18) కొర్రా సుబ్బారావు (25) గాయ పడ్డారని వారిని సప్పర్ల ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలే చేర్పించి చికిత్స అందిస్తున్నారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ్, డి. ఆర్. ఓ, బి. పద్మావతి, సిపి ఓ ఎస్. ఎస్. ఆర్.కె. పట్నాయక్, వివిద ప్రాంతాల నుండి ఎస్సీ సుమీత్ బర్దార్, ఐటీడి ఏ పిఓలు, కట్టా సింహాచలం, అపూర్వ భరత్, సబ్ కలెక్టర్లు కల్పశ్రీ, సౌర్యమన్ పటేల్, తాహశీల్దారులు, ఎంపిడి ఓలు పాల్గొన్నారు.

కోతకు గురైన మినీ రిజర్వాయర్

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గడిచిన నాలుగు రోజుల నుండి వర్షాలతో మండలంలోని కొర్రాయి మినీ రిజర్వాయర్ వర్షాల కారణంగా కోతకు గురైంది. వర్షాలతో రిజర్వాయర్లో సామర్థ్యానికి మించి వరద నీరు చేరడంతో ప్రమాద స్థాయికి చేరింది. మినీ రిజర్వాయర్ కోతకు గురవ్వడంతో పంట పొలాలు నీట మునిగాయి. టిడిపి హయంలో నిర్మించిన మినీ రిజర్వాయర్ నిర్వాహణ బాధ్యతను గాలిలో వదిలేయడంతో పంట పొలాలకు నష్టం వాటిల్లుతుందని గిరిజన రైతులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. ఆ పంచాయతీ సర్పంచి పూజారి కొమ్ములు సంబంధిత అధికారులకు సమాచారం అందించడంతో మట్టి బస్తాలతో ఉధృతి తగ్గించేందుకు చర్యలు చేపట్టారు.

వట్టిగడ్డను పరిశీలించిన సీఐ హరిబాబు

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలోగల రావాడగ్రామంవద్ద ఉన్న ఒట్టిగడ్డ రిజర్వాయర్ ను సోమవారంనాడు ఎల్విన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ,చినమేరంగి సిఐ హరిబాబు పరిశీలించారు. ప్రాజెక్టుకు వరద తాకిడి ఎలాఉందోనని పరిశీలిస్తూ సమీప గ్రామ ప్రజలతో, ఉద్యోగులతో, అధికారులతో ఆయన మాట్లాడారు ప్రస్తుతం వట్టిగడ్డ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 399 అడుగులయితే, ఇప్పుడు రిజర్వాయర్లో ఉన్న నీటిమట్టం 382 అడుగులుగా ఉండటం గమనార్హం. సమీప గ్రామాలైన రావాడ, రావాడరామభద్రపురం తదితర గ్రామాలలో గల ప్రజలతో మాట్లాడి కొంచెం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయనతో పాటు ఎస్ఐ అనిష్ పాల్గొన్నారు.

బిక్కుబిక్కుమంటున్న బాసంగి గ్రామస్తులు: మండలంలోగల నిర్వాసిత పంచాయితీ గ్రామమైన బాసంగి గ్రామస్తులు బిక్కు బిక్కు మంటూ ఉన్నారు. తుఫాను కారణంగా మన్యం జిల్లాను వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. సోమ మంగళ వారాల్లో ఒరిస్సా రాష్ట్రంలో వర్షాలు కురవ నున్న నేపథ్యంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని రాత్రింబవళ్లు కంటిమీద కునుకు లేకుండా జీవిస్తున్నారు నాగావలి రిజర్వాయర్ ఎఫ్ ఆర్ ఎల్ 105 మీటర్లు కాగా ప్రస్తుతం 103.90 మీటర్లు నీటిమట్టం ఉండడం వల్ల గ్రామ ప్రజలు మరింత భయాందోళన చెందుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ డి వి సీతారామయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం వరకు ఎలాంటి ప్రమాదసూచిక కనిపించలేదని ఆయనస్పష్టం చేశారు.

సొంత నిధులతో విద్యాబోధన

విశాలాంధ్ర - అనంతగిరి : మండల పరిధిలో చిలకల గడ్డ పంచాయతీ లోగల దాశరి తోట గ్రామంలో శిథిలావస్థకు చేరిన భవనంకు ఉపాధ్యా యురాలు ఝాన్సీ విద్యార్థులకు విద్యాబోధన అందించాలని ఉద్దేశంతో తన సొంత నిధులతో రేకుల షెడ్డు వేసి విద్యాబోధన చేస్తు న్నారు. ఈ విషయంపై అధికారులు ఎన్ని మార్లు చూసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు నాడు నేడు అని అనేక పాఠశాలకు మరమ్మతులు చేసిన దాశరథ తోట పాఠ శాలకు పోవడం బిద్దరంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి శిథిలావస్థకు చేరిన దాశరథ తోట పాఠశాల భవనంకు మరవతల నిర్వహించే విద్యార్థులకు విద్యాబాధన చేయాలని గ్రామస్తులు తెలుపుతున్నారు.

సిఎం సహాయ నిధికి ఐ.ఎం.ఏ రూ.1.25 లక్షలు చెక్కు అందజేత

విశాలాంధ్ర - పార్వతీపురం : రాష్ట్రంలో వరదల దృష్ట్యా ముఖ్యమంత్రి సహాయ నిధికి పార్వతీపురంశాఖ ఇండియన్ మెడికల్ అసోషియేషన్ (ఐ.ఎం.ఏ) రూ.1.25 లక్షలు విలువ చెక్కును సోమవారం జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్కు అందజేసారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఐఎంఏ అధ్యక్షులు డా.యాళ్ళ వివేక్, కార్యదర్శి డా.వాసుదేవరావు సభ్యులు అంద జేసారు. సహాయనిధికి చెక్కును అందించడం పట్ల జిల్లా కలెక్టర్ వైద్యులను అభినందించారు. జిల్లా నుండి సహాయ నిధికి అందించడం ఆనందంగా ఉందని, ఉదారత కలిగిన సంఘాలు, వ్యక్తులు ముందుకు రావడం ముదావహ మన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు డా.బి వాగ్దేవి, డా.వై.విపద్మజ, డా.డి.ప్రతిమా దేవి, డా.హేమంత్, డా.పవన్ కుమార్, తవిటినాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పర్యటన..

విశాలాంధ్ర - పాలకొండ : పాలకొండ నియోజక వర్గ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల కొండ పట్టణంలో సోమవారం సుడిగాలి పర్యటన చేశారు గత రెండు రోజులుగా పట్టణంలో కురుస్తున్న వర్షాలకు పట్టణంలో చాలా ప్రాంతాలు నీటమునిగిపోయాయి ప్రధానంగా గాయత్రీ నగర కాలనీ, ఎన్ కె.రాజపురం, గారమ్మ కాలనీ,సేగిడివీధి, తదితర లోతట్టు ప్రాంతాలను పరిశీలన చేశారు ఈ సందర్భంగా కమిషనర్ సర్వేశ్వరరావును ఇరిగేషన్ అధికారులకు తగు సూచనలు ఇచ్చి ఈ ప్రాంతంలో వరద ప్రాంతాన్ని స్వరతగతిగా నీరు తొలగించే విధంగా చర్యలు చేవట్టాలని సూచించారు,%అని% రాజపురం జంక్షన్ లో ఇరుపక్కల యుద్ధ ప్రాతిపదికన మేజర్ డ్రైనేజీలను నిర్మించాలని వీటికి తగ్గ అంచనాలు తక్షణమే వేయాలని ఆదేశించారు ఈ డ్రైనేజీ నిర్మాణాలు చేపడితే ముంపు ప్రాంతాలకు వరద నీరు రాదని అన్నారు అలాగే మండల పరిధిలో జంపర్ కోట రిజర్వాయర్ తదితర ప్రాంతాలను పరిశీలన చేశారు ఆయనతోపాటు పార్టీ నాయకులు, గండి రామినాయుడు, వెన్నపు శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు గంట సంతోష్, అలాగే వైకాపా కౌన్సిలర్లు వైకాపా పట్టణ అధ్యక్షుడు ఐదవ వార్డ్ కౌన్సిలర్ వెలమల మన్మధరావు, కడగల వెంకటరమణ,భాసూరు కాంతారావు,కోడెమ్ విజయ్ కుమార్,హనుమంతు తమ్మారావు,గర్భాన సత్తిబాబు, దుర్గారావు,ఇతర శాఖల అధికారులు, అనేకమంది పార్టీ నాయకులు ఉన్నారు.

శబరి నది పరివాహక గ్రామాలలో పర్యటించిన తాసిల్దార్

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని శబరి గోదావరి పరివాహక ప్రాంతాలలోని చింత రేగుపల్లి, ప్రత్తిపాక, రామవరం, గ్రామాలలో తాసిల్దార్ సుబ్బారావు సోమ వారం పర్యటించారు. గ్రామ ప్రజలతో మాట్లాడుతూ శబరి వరద పరిస్థితులను గ్రామస్తులకు వివరించారు, రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని శబరి పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండవలెనని వాగులు పొంగి ప్రవహిస్తున్నందున ఎవరు చేపల వేటకు వెళ్లి ప్రమాదాలబారిన పడకుండా జాగ్రత్త వహించవలనని గ్రామస్తులకు తెలియజేశారు, భారీ వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండి ఎటువంటి ప్రాణ నష్టము జరగకుండా జాగ్రత్త తీసుకోవాల్సిందిగా గ్రామస్తులను తెలియపరిచారు, ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంబంధిత అధికారులు రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కొండ చరియల ప్రాంతాన్ని పరిశీలించిన మండల ప్రజా ప్రతినిధులు

విశాలాంధ్ర - జీకే వీధి : గూడెం కొత్తవీధి మండలం గాలికొండ పంచాయితీ పరిధి చట్రపల్లి గ్రామంలో జరిగిన ఘటన సందర్భంగా కొండ చరియలు విరిగి పడి ముగ్గురు గాయాలు ఒకరు మృతి చెందారనీ విషయం తెలుసుకున్న మండల జీకే వీధి మండల ప్రజా ప్రతినిధులు ఎంపీపీ బోయిన కుమారి ,వైసిపి జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరి ప్రసాద్ ఛట్రపల్లి గ్రామంలో పర్యటించారు. గ్రామస్తుల ద్వారా అన్ని విషయలు అడిగి తెలుసుకోవడం ,కొండ చరియలు ప్రాంతాన్ని అంతట పరిశీలించుట జరిగిందన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని ఆ కుటుంబాల్ని ప్రభుత్వం ఆదుకునేలా ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. బాధిత కుటుంబాల్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫిజియోథెరపి దినోత్సవం

విశాలాంధ్ర - బెలగాం : విశాఖపట్నం హెూటల్ మంత్రిస్ నందు ఆదివారం ప్రపంచ ఫిజియో థెరపి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికిగాను వివిధ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు, విశాఖపట్నంలో ప్రాక్టీషనర్లు, టీచర్లు, సీనియర్ ఫిజియో థెరపీలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఆదినారాయణ ఫిజియో థెరపీ యొక్క ప్రాధాన్యతను వివరించారు. అనంతరం కల్చరల్ ప్రోగ్రాంలు, డాన్సులు, పాటలు నిర్వ హించబడ్డాయి. తదనంతరం సైటిఫిక్ సెసన్స్ నందు బహు మతులను పెపర్, పోస్టర్, క్విజ్కు గాను పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఫిజియోథెరపీ వైద్యులు డా. ఎద్దు లక్ష్మీనారాయణ రిబోర్న్ ఫిజియో వెల్ఫేర్ తరపున బహుమతులు అందజేశారు. కోర్ కమిటీ సభ్యులైన డా. శరత్ చంద్, డా. రవిప్రకాష్, డా. సంజయ్, డా. మనస్విని, డా. నందిని, డా.దేవిశ్రీ, డా.వినయ్ ఫిజియోథెరపి దినోత్సవ వేడుకలను పిఎవి (పావ్) తరుపున విజయవంతంగా నిర్వహించారు.

వెలవెలబోయిన వారపుసంతం

విశాలాంధ్ర - పెదబయలు : గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండల కేంద్రంలో జరిగే సోమవారం వారపు సంత జనాలు లేక వేలవేల పోయింది భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పొట్టకూటి కొరకు కొంతమంది మాలీలు పలువురు చిరు వ్యాపారస్తులు సంతకు వచ్చి దుకాణాల పెట్టినప్పటికీ సంతకు ప్రజలు రాకపోవడం వలన కనీసం రవాణా ఖర్చులు సైతం రాని పరిస్థితి ఏర్పడింది రోడ్డుపై చిరు వ్యాపారాలు చేసుకునే గిరిజనులు సామాలు మొత్తం తలచిపోయి ఇబ్బందులకు గురయ్యారు.

పత్తి మొక్కజొన్న వరి పంటల పరిశీలన

విశాలాంధ్ర - పాచిపెంట : తుఫాను అధిక వర్షాల కారణంగా ఎక్కడైనా పంట నష్టాలు వాటిల్లితే వెంటనే సంబంధిత రైతు సేవా కేంద్రాలలో తెలియజేయాలని వ్యవసాయ అధికారి కే తిరుపతి రావు అన్నారు. అలాగే గ్రామ వ్యవసాయ సహాయకులు అందరూ క్షేత్రస్థాయిలో తిరిగి అధిక వర్షాల అనంతరం తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించాలని ఆదేశించారు .పాంచాలి గురువి నాయుడుపేట సరైతువలస గ్రామాలలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మొక్కజొన్న 6000 ఎకరాలు పత్తి 3250 ఎకరాలు వరి 2000 ఎకరాలు సాగుతుందని ప్రస్తుతానికి వరి పంటకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని గాలులు లేకపోవడం వలన మొక్కజొన్న పంట కూడా దెబ్బతినలేదని ముందుగా వేసిన పత్తి ప్రస్తుతం కాయలు విచ్చు కుంటున్నందున 15 ఎకరాలు పత్తి దెబ్బతిందని కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పత్తి పంటను మరల బాగు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతా రామరాజు జిల్లా మండల కేంద్రం రేఖపల్లి పంచాయతీలో సర్పంచ్ పూనం సరోజిని, సెక్రెటరీ శివప్రసాద్ ఆధ్వర్యంలో రేఖ పల్లిలోని మురుగు గుంటలు ఉన్న నీళ్లను ఇంజన్ జెసిపి సహాయంతో దగ్గరుండి పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా సోమవారం శుభ్రం చేయించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది రోజులు నుండి . ఏకధాటిగా పడుతున్న వర్షాలకు డ్రైనేజీలు మురుగు గుంటలు నీళ్ల నిలవలు ఉండటంతో దోమకాటు ఎక్కువ అవుతుందని ముందు జాగ్రత్త చర్యగా ఇంజన్ సహాయంతో నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలు శుభ్రం చేపిస్తున్నామ ని ప్రజలు వ్యాధులు బారిన పడకూడదని ఇప్పటికే జ్వరాలతో చాలా మంది బాధపడుతున్నారని ఆమె అన్నారు. ఈ కార్య క్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పూనం. సత్య నారాయణ, సచివాలయం సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జల దిగ్బంధంలో చింతూరు మండలం

ఒడిశా, ఆంధ్ర, రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు బంద్

విశాలాంధ్ర- చింతూరు : చింతూరు మండలం గత రెండు రోజుల నుంచి తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. ఒడిస్సా రాష్ట్రంలోని మాచ్ ఖండ్ జలాశయం నుండి సీలేరుకు లక్షలాది క్యూసెక్కుల నీరు సీలేరు నది కి విడుదల దీంతో సంబంధం ఉన్న డొంక రాయి, పోల్లూరు జలాశయాల నుండి నీరు విడుదల చేశారు. దీనివల్ల మోతుగూడెం గ్రామంలోకి సీలేరు నది నుండి నీరు చేరుకుంది. .దీంతో శబరి, సీలేరు నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీనివల్ల చింతూరు నుండి ఒరిస్సా వెళ్లే మార్గం 326 జాతీయ రహదారి మూసుకుపోయింది. చింతూరు నుండి ఒరిస్సా వెళ్లే మార్గంలో కూయ్ గుర్ వద్ద వాగు ఎగపోటుకు గురవడంతో రోడ్డుపై నీరు చేరింది. దీనివల్ల ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే చింతూరు నుండి భద్రాచలం వెళ్లే రహదారిలో చట్టి గ్రామ వద్ద శబరి నది వల్ల చంద్రవంక ఎగపోటుకు గురవడంతో భద్రాచలానికి రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే చింతూరు నుండి విఆర్ పురం వెళ్లే మార్గంలో సోకిలేరు, చీకటి వాగు శబరి నది ఎగపోటుతో రోడ్పై నీరు చేరుకోవటంతో రెండు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం నుండి చింతూరుకు, ఒరిస్సా నుండి హైదరాబాద్కు, విశాఖపట్నం నుండి భద్రాచలం, రాజమండ్రి, కాకినాడ నుండి భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సులను రద్దు చేసింది. సీలేరు నుండి చింతపల్లి వెళ్లే ఘాట్ రోడ్ లో కొండ చరియలు విరగి పడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే సీలేరు నుండి చింతూరు వచ్చే రహదారిలో బచ్చులూరు వద్ద బ్రిడ్జి కొట్టుకుపోవడంతో సీలేరుకు చింతూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం సాయంత్రానికి చింతూరు వద్ద శబరినది నీటిమట్టం 40 అడుగులకు చేరింది. దీనివల్ల చింతూరుకు పాత చింతూరు ఒడ్డు కు రాకపోకలు నిలిచిపోయారు. ఇంకా వరద పెరిగే సూచనలు ఉన్నాయని

చింతూరు ఒడ్డున ఉన్న ప్రజలు ఖాళీ చేయాలని గ్రామ పంచాయతీ అధికారులు ఉన్నతాధికారుల సూచనల మేరకు మైక్ లో చాటింపు చేశారు. మంగళవారం వరద పెరిగే సూచనలు ఉన్నాయని చింతూరు, కూనవరం, వీఆర్పురం మండలాల్లోని పలు గ్రామాలకు వరద ముప్పు ఉంటుందని అధికారులు తెలియజేస్తున్నారు.

గర్భిణీ స్త్రీలకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ

విశాలాంధ్ర - దేవీపట్న : అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు దేవీపట్నం మండలం జనసైనికులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కాకి స్వామి, దాసరి తరుణ్ ఆధ్వర్యంలో ఫ్రూట్స్ బ్రెడ్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేయడం జరిగింది. ప్రతి నెల 9వ తేదీన గర్భిణీ స్త్రీలకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో పీఎం ఎస్ఎంఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. దీనిలో భాగంగానే ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం ఉపాధ్యక్షులు కాకి స్వామి మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు పార్టీ తరఫున ఏదో ఒక మంచి కార్యక్రమం చేపట్టాలని సూచనతో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సంద ర్భంగా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఇందులో భాగంగానే దేవీపట్నం మండలంలోని ఇందుకూరు పేటలోని జనసేన పార్టీ కార్యకర్తలు కలిసి పేషెంట్లకు బ్రెడ్డు ఫ్రూట్స్ వాటర్ బాటిల్ డ్రింక్ బాటిల్ పంపిణీ అదేవిధంగా ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ తాళ్లూరి డేవిడ్, డాక్టర్ ఎం.సరస్వతి, జన సైనికులు ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటించడం జరిగినదన్నారు. అనంతరం కట్టుమూరి వీరబాబు మాట్లాడుతూ ఇందుకూరు పేటలో ఉన్న జనసైనికులు కలిసి పేదలకు, గ్రామాలలో పనికి వచ్చే మంచి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల వైస్ కన్వీనర్ కర్రీ మహేష్, కట్టుమూరి వీరబాబు, కట్టుమూరి తాతాజీ, మట్ట పెద్దకాపు, దివిటి ఆంజనేయులు, మట్ట సందీపు గొల్లపల్లి అరవింద్, పోతుల గాంధీ, కొత్తపల్లి సతీష్, మడకం వెంకటేశులు, తుర్రం రమేష్ దొర, సోదే రవికుమార్, తాతి రాజేష్, కొనుతుల పోతురాజు, తోకల పండు, తదితరులు పాల్గొన్నారు.

చక్కెర కర్మాగారంలో చోరీకి పాల్పడిన వారిని గుర్తించాలి

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేట ఎన్సిఎస్ చక్కెర కర్మాగారంలో పవర్ ప్లాంట్ వద్ద దొంగతనం జరిగి పదిరోజులు దాటిన ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని పార్వతీపురం ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఎస్సై రాజేష్ ను నిలదీశారు. సోమవారం నాడు చక్కెర కర్మాగారాన్ని ఆయన సందర్శించారు. కర్మాగారంలో కోటికిపైగా విలువచేసే దొంగతనంజరిగిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.కర్మాగారంలో కొంతమంది వలన ఇటువంటి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. కర్మాగారానికి సంబంధించి చాలా వస్తువులు పోతున్న ఎవరు ఫిర్యాదులు ఇవ్వకపోవడంతో యధేచ్ఛగా దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల కర్మాగారంలో దాదాపు కోటిరూపాయలకు పైగా విలువచేసే వైర్లు ఆయిల్, ఇనుము దొంగతనం జరిగిన ఇంతవరకు ముద్దాయిలను గాని, అనుమానితులనుగాని ఎందుకు ప్రశ్నించలేదన్నారు. ఎన్ సిఎస్ యాజమాన్యానికి సంబంధం లేకపోవడం, ఎక్కడో దూరప్రాంతంలో ఎన్సీఎల్టి అధికారులు ఉండడంవలన కొంతమంది స్థానికకుల ప్రభావంవల్లనే దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. ఎప్పటికైనా పోలీస్ అధికారులు దృష్టి సారించి దీనిలో దొంగతనానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎస్పీతో కూడా మాట్లాడతానని ఆయన తెలిపారు. ఎన్సీఎల్ టీకు చెందిన వారితో కూడా ఆయన మాట్లాడారు. కర్మాగారంలో దొంగతనంపై కేసునమోదు చేసామని, శాఖాపరంగా విచారణచేస్తున్నట్లు చెప్పారు.ఇప్పటికే పలుటీములు కూడా సందర్శన చేశాయని ఎస్ఐ రాజేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులుతో పాటు శ్రీరామ షుగర్ మిల్స్ లేబర్ యూనియన్ అధ్యక్షులు, కండాపు ప్రసాదరావు,ప్రధాన కార్యదర్శి చెలికాని వెంకట గోపాలకృష్ణ, నాయకులు కొండలరావు, శ్రీరామ్, స్వామి, బార్నాల అప్పారావు తదితరులతో కర్మాగార ఉద్యోగులు పాల్గొన్నారు. కర్మాగార యూనియన్ తరఫునుంచి కూడా కర్మాగారంలో పోయిన వైర్లు ,ఆయిల్ పై ఫిర్యాదు చేసినట్లు తెలిపార్ను

శిధిలావస్థకు చేరిన పెదరామ గేడ్డ బ్రిడ్జి .. భయాందోళనలో గిరిజనం

విశాలాంధ్ర - సీతంపేట : మండలం పెదరామ పంచాయతీ గ్రామ సమీపంలో గల పురాతన బ్రిడ్జి మన్యం ప్రాంతంలో భారీ వర్షాలు, తుఫానులతో గేడ్డలు భారీగా కొండల ఎగువ ప్రాంతం నుండి పొంగి, పొర్లి, పారుతున్నడంతో బ్రిడ్జ్ దిగువ భాగంలో గల ప్రొటెక్షన్ వాల్స్ కృంగి పోవడంతో శిధిలావస్థకు చేరిందని పెదరామ గ్రామస్తులు మరియు ఆ బ్రిడ్జి మీదగా అనేక గిరిజన గ్రామాలు చెందినవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ శిధిలవస్థ బ్రిడ్జి మీదగా కోపివలస, ఈత మానగూడ, కొత్తగుడ, వంబరవెల్లి, సరిహద్దుగుడ, గ్రామాలకు చెందిన వందలాది మంది గిరిజనులు తాము పండించుకున్న అటవీ ఉత్పత్తులు ఆ బ్రిడ్జి మీదగా దిగువ ప్రాంతాలకు తీసుకువచ్చి మార్కెట్ చేసుకోవడం జరుగుతుంది అన్నారు. అదే విధంగా ఏ అనారోగ్య సమస్య వచ్చినా గర్భిణీ స్త్రీలకు ఎమర్జెన్సీ వైద్యం నిమిత్తం 108, 104 వాహనాలు, రేషన్ సరుకు సంబంధించిన వాహనాలు ఆ బ్రిడ్జి మీద గా మా గ్రామాలకు వస్తాయని, అయితే ఈ బ్రిడ్జ్ ఏసమయంలో కూలిపోతుందో అనే భయాం దోళనలో గిరిజనులు అంతా బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు చేస్తూ బతుకుతున్నారని తెలిపారు నూతన బ్రిడ్జి నిర్మాణం కొరకు స్థానిక ప్రజా ప్రతి నిధులు ఐటిడిఏ అధికారులు తక్షణమే స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ తిరుపతిరావు, కొత్తగూడ ప్రెసిడెంట్ ప్రతినిధి అప్పారావు, సవర మోహన్పాల్ తెలిపారు.

ఛట్రపల్లి కొండచరియలు విరిగిపడి ఒకరు మృతి.. ముగ్గురు గాయాలు

విశాలాంధ్ర - జీకే విధి : ఎడతెరిపి లేకుండా వర్షాలకి గూడెం కొత్త వీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధి చట్రాపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో కొండచరియలు ఒక్కసారిగా గ్రామంలో విరుచుకపడి ఇండ్లన్నీ ధ్వంసం అయ్యాయి. ముగ్గురు గాయపడ్డారు ఒకరు కొర్ర కుమారి (20) మృతి చెందరు. పాడేరు నియోజకవర్గం ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజ్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు చట్రపల్లి గ్రామానికి వెళ్లేందుకు బయలుదేరిన వైద్య ,పోలీస్, రెవెన్యూ లకు కొండ మార్గాల్లో వరదలు, వాగులు, కాలువలు దాటుతూ తీవ్ర ఇబ్బందులు పడుతూ చట్రపల్లి గ్రామానికి చేరుకొని, గ్రామంలో సహాయకచర్యలో పోలీసు, రెవెన్యూ బృందలు పాల్గొన్నాయి. వైద్య బృందాలు పర్యటించి ప్రజలందరికీ వైద్యం అందించారు. చట్రాపల్లి కొండ చరియల్లో విరిగిపడిన ఘటనలో మృతి చెందిన కొర్ర కుమారి (20) మహిళ కుటుంబ సభ్యులకు జాతీయ విపత్తుల సంస్థ నిబంధనల ప్రకారం ఐదు లక్షల ఎక్స్ బిగ్రేషియా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ప్రకటించడం జరిగింది. మరో ముగ్గురు వ్యక్తులు కొర్ర పండన్న (60) కొర్ర సుమిత్ర(18) కొర్ర సుబ్బారావు (25) గాయ పడ్డ వారిని వారి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు మెరుగైన వైద్యం సపర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందిస్తున్నారు.

రెండో రోజు కొనసాగిన వాగుల ఉధృతి...



విశాలాంధ్ర - వై.రామవరం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వై.రామవరం మండలంలో వాగుల ఉధృతి రెండో రోజు కొనసాగింది. బండిగడ్డ, యార్లగడ్డ, పెదౌలెం పాడు, దలిపాడు, గుర్తెడు వరకు ఉన్న కొండ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల గిరిజనుల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఎంపీడీవో బాపన్న దొర, ఎస్ఐ సంతోష్ కుమార్, పంచాయితీ, సచివాలయ సిబ్బంది వాగుల వద్ద ఉండి ప్రజలను అప్రమత్తం చేశారు. వాగులకు అవతల, ఇవతల వైపు ఉన్న ప్రజలు, ఉద్యోగుల సైతం ఎక్కడ వారు అక్కడే అన్డిపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

దూర్వాగణపతి త్రిరాత్ర దీక్షా సహిత విద్యాగణపతి మరియు జ్ఞానసరస్వతీ యాగము

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం పట్టణం శివారులో ఉన్న శ్రీ సూర్య పీఠంలో వేంచేసి యున్న లక్ష్మీగణపతి ప్రీతికరంగా దూర్వాగణపతి త్రిరాత్ర దీక్షా సహిత విద్యాగణపతి మరియు జ్ఞాన సరస్వతీ యాగము సౌర యాగశాలలో మూడు రోజులు నిర్వహించబడునని అశేషశేముషీనిధి బ్రహ్మశ్రీ వేమకోటి నరహరిశాస్త్రి తెలిపారు. యాగంలో మొదటి రోజు సౌరయాగశాలలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, విఘ్నేశ్వర పూజా, పుణ్యాహ వాచనం, పరిషత్, కృచ్ఛ్రత్రయం, వంచగవ్య ప్రాశన, రక్షాసూత్రధారణ, పాలికాస్థాపన, అఖండ దీపస్థాపన, అగ్నిప్రతిష్ఠాపన, కుండమంటప సంస్కారం, శాలా విహరణాదులు, యోగినీ, క్షేత్రపాలక, వాస్తు నవగ్రహ మంటపముల, సర్వతో భద్రమండల, 32 గణపతుల ఆవాహన, అర్చనలు, అభిషేకములు, ప్రదోషకాలంలో అష్ట దిగ్బలిహరణ, గణపతి మూలమంత్ర హవనములు జరిగాయి. దూర్వాగణపతి సహిత విద్యాగణవతి, జ్ఞానసరస్వతీ త్రిరాత్ర యాగంలో లక్షపత్రి పూజ మరియు పూర్ణాహుతిలో పార్వతీపురం పురపాలక సంఘ మాజీ వైస్ ఛైర్మన్ బెలగాం జయప్రకాశ్ నారాయణ (జయబాబు) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వి.వివేకానంద శర్మ, ఆర్.కె శర్మ తదితరులు పాల్గొన్నారు.